క్లుప్తంగా

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



తిరువూరు: వాహనచోదకులు రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలని తిరువూరు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం తిరువూరు అయ్యప్ప గుడి సెంటర్‌లో వాహనాల ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారికి అపరాధ రుసుం విధించారు. వాహనం నడుపుతూ మొబైల్ మాట్లాడటం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. సెక్టార్–2 ఎస్‌ఐ పద్మారావు పాల్గొన్నారు.

అన్నసమారాధన



విస్సన్నపేట: స్థానిక పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడు జి.రాంబాబు, అసోషియేట్ అధ్యక్షుడు పర్వతం వెంకటసత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ చెరుకు వెంకటముత్యం, సెక్రటరీ వెంగల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలు వెంగల వెంకట్రామయ్య, జి.చెన్నారావు, ట్రెజరర్ పవన్ పాల్గొన్నారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం

తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానంలోస్వామివారిబ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నమ్మాళ్వార్ల అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవాయిద్యాలతో తీర్థపు బిందె, పల్లకీసేవ, సేవాకాలం, సహస్ర నామార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావు, దేవాదాయశాఖ మేనేజరు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

మోటార్ బైక్ చోరీ

నూజివీడు: మండలంలోని జంగంగూడెంలో శనివారం అర్ధరాత్రి ఓ వ్యక్తికి చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన గుండుబోయిన సత్యన్నారాయణ తన పల్సర్ బైక్‌ను ఇంటిబయట పెట్టి నిద్రించాడు. తెల్లవారిన తరువాత ఆదివారం ఉదయం చూడగా ఇంటి ముందు బైక్ కనపించలేదు. దీనిపై బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాభి నోరు అదుపులో పెట్టుకోవాలి

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు మన్ననలు పొందాలని అవాకులు చవాకులు పేలితే సహించేది లేదన్నారు. పేదలకు మేలు చేయడమే తప్ప కీడు చేయని ఎమ్మెల్యే కుటుంబంపై పట్టాభి మాట్లాడిన తీరుని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, జెడ్పీటీసీ చెలికాని అనూషా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, మండల పార్టీ నాయకులు దామెర ప్రసాదు బాబు, చెలికాని బాబ్జీ, కారంగుల వాసు, పరసా చెన్నారావు, మాదల నరశింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుల దాడులు

బూదవాడ(జగ్గయ్యపేట): కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడులు చేసిన సంఘటన ఆదివారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు చిల్లకల్లు ఎస్సై కె.దుర్గాప్రసాద్‌కు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. దాడిలో ఐదుగురు వ్యక్తులు 10 ద్విచక్ర వాహనాలు, రూ.5,200 నగదుతో పాటు రెండు పుంజులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

ఎమ్మెల్యే రక్షణనిధి

పెద్దవరం(తిరువూరు): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకూ నిధులు కేటాయిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని పెద్దవరంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసి వారికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల వివరాల బ్రోచర్లు అందజేశారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు త్వరితగతిన ప్రజలకు చేరుతున్నాయన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారు వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.



తిరువూరు మండలం పెద్దవరంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణ నిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, తిరువూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గద్దె రాధాకృష్ణ, పెద్దవరం గ్రామ సర్పంచి అప్పారావు, రాజుగూడెం, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్లు కొమ్మినేని కిషోర్, గుడిపూడి నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దొంగల నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ఈనెల 31న ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. మెగా జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో కియా, మోహన్ స్పిన్‌టెక్స్, అమర్‌రాజా, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, హీరో మోటో కార్ప్ లిమిటెడ్ వంటి 15 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ మేళాకు పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకావాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.9 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్‌హబ్‌లు, స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేసి పరిశ్రమలకు అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇచచి వారికి ఉపాధిని కల్పిస్తోందన్నారు. దీనివల్ల పేద, మధ్య తరగతికి చెందిన యువతీ యువకులు ఉపాధిని పొందుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని జాబ్‌మేళాలను ఏపీఎస్ఎస్‌డీసీ నిర్వహించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



భక్త జనసందోహం మధ్య కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో కేరళ మృదంగం, మహిళల కోలాటం, కృష్ణాజిల్లా ఉంగుటూరుకు చెందిన వారి కోలాటం నడుమ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు మచ్చా హరిబాబు, మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన పండు, ఎంపీటీసీ గోపీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసారవు, జెడ్పీటీసీ వీరబాబు తదితరులు రథోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే కృతజ్ఞతలు..

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారి రథసప్తమి ఉత్సవాలను విజయవంతం చేసిన సందర్భంగా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి వారం రోజులుగా కృషి చేసిన అన్నదాన కమిటీ సభ్యులను, గ్రామస్తులను, భక్తులను అభినందించారు. వచ్చే నెలలో కొండపై వెలసిన స్వామివారిని దర్శించుకునేందుకు ఘాట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



రథోత్సవం ముందు కేరళ మృదంగ బృంద విన్యాసాలు

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 30న స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు. స్పందనలో ఇచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు 'స్పందన'

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు.

మామిడి రైతులను ముంచుతున్న పొగమంచు

ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

మైలవరం: పొగ మంచుతో మామిడిలో పూత రాలిపోయి కాయ దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మైలవరం, జీ.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో 22,500 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. గత కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులతో ఉదయం వేళల్లో పొగ మంచు దట్టంగా విస్తరించడంతో పూత రాలిపోయిందని, దీంతో కాయ దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. దీనిపై హార్టికల్చర్ అధికారిని వివరణ కోరగా పొగమంచు తీవ్రంగా ఉండటం వలన మంచు బిందువులు మామిడి పిందె తొడిం మొదట్లో నిలిచి, ఫంగస్‌తో ఇన్‌ఫెక్షన్ సోకుతుందన్నారు.

ఇలా చేస్తే మేలు..

పొగ మంచుకు పిందెలు రాలకుండా ప్లానోఫిక్స్ 4.5 గ్రాములు 10లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారి చేయాలని, లేదా బ్‌లైటెక్స్, సాఫ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిసి పిచిచారీ చేయాలని ఉద్యాన శాఖ సహాయాధికారి అహ్మద్ తెలిపారు. ప్రస్తుతం తోట బడి కార్యక్రమంలో ఈ విషయాలను రైతులకు వివరిస్తున్నట్లు తెలిపారు. గతేడాది మామిడి టన్ను ముంబాయ్ మార్కెట్‌లో రూ.లక్ష వరకు పలికింది. విజయావాడ మార్కెట్‌లో టన్ను రూ.50 వేలు నుంచి రూ.60 వేల వరకు పలికింది. ఈ ఏడాది ముందస్తుగా వచ్చిన రసాలు, తోతాపురి బయటి మార్కెట్‌లో టన్ను రూ.80 వేల నుంచి 90 వేల వరకు పలుకుతున్నట్లు రైతులు తెలిపారు.



రెడ్డిగూడెంలో కాయలతో ఉన్న మామిడి తోట

ఉత్సాహంగా అ'పూర్వ' సమ్మేళనాలు



మూలపాడు జెడ్పీ పాఠశాల 1982 బ్యాచ్ టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థులు



గోపవరం హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

ముసునూరు: చిన్న నాటి జ్ఞాపకాలు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుని వారంతా జచిన్నపిల్లలైపోయారు. వారంతా మళ్లీ కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని ఆనంద పరవశుల య్యారు. గోపవరం హైస్కూలు ఇందుకు వేదికైంది. గోపవరం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు సీతారామయ్య, లక్ష్మీ ప్రసన్న, వీరాంజనేయులు ఆధ్వర్యంలో 2012–2013లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఉన్న వారంతా మళ్లీ కులుసుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగ, ఉపాధి, కుటుంబ వివరాలను సహచరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు కె.పద్మ, సుకుమార్, పైడి శ్రీనివాసరావు, రవివర్మ, ఎండీ రఫీ, జ్యోతిర్మయి, ప్రభామణి, రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మూలపాడు(ఇబ్రహీంపట్నం): వారంతా 1982–83 పదో తరగతి ఒకే స్కూలులో చదివారు. ఇప్పటికి 40 ఏళ్లు గడిచాయి. ఆదివారం మళ్లీ వారు చదువుకున్న స్కూలులో కలిశారు. గుర్తుపట్టలేనంతగా ఆకారాలు మారిపోయి ఒకరినొకరు తెలుసుకుని ఆప్యాయంగా పులకరించుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. మూలపాడులోని జెడ్పీ హైస్కూల్ ఇందుకు వేదికైంది. మూలపాడు జెడ్పీ పాఠశాలలో 1982–83 విద్యా సంవత్సరంలో టెన్త్ క్లాస్ చదివిన పూర్వ విద్యార్థులు 50 మంది ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాల్యమిత్రులు 40 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకోవడం చెప్పుకోలేని మధుర అనుభవమని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, రాజకీయాలు, వ్యాపారం, స్వయం ఉపాధి వృత్తుల్లో స్థిరపడిన వారు ఒకచోట కలుసుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఆనాటి గురువులను సత్కరించారు. సమ్మేళనం కమిటీ సభ్యులు బోడేపూడి కమలేశ్వరరావు, పులి సంజీవరావు, పగడాల జమలయ్య, సైకం సాంబశివరావు, సయ్యద్ ఖాశిం నిర్వహించారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన ఉత్తరాభిముఖ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారి ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం వేకువ జామున సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం కమనీయంగా సాగింది. శ్రీవారి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వాసవీ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు, దేవాలయ వ్యవస్థాపక నిర్మాణ దాతలు నీలి మురళీధరరావు, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు నీలి వేంకట యుంగధర్ సతీష్ కుమార్–రమా అంజనీ కుమారి, ట్రస్ట్ అధ్యక్షులు జొన్నలగడ్డ శివ ప్రసాద్, కోశాధికారి నీలిశెట్టి చెన్నకేశవులు, సత్యనారాయణ, సురేష్, పొత్తూరి మణికంఠ, ఆదిశేష గుప్తా, శ్రీనివాస్, లక్ష్మణరావు, స్వరూప్‌కుమార్, శ్రీనివాసగుప్తా, శివాజీ, వైకుంఠం, వేణు, వెంకన్న, ట్రస్ట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీవారి శాంతి కల్యాణాన్ని జరిపిస్తున్న దృశ్యం

75 మందికి వైద్య పరీక్షలు

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద నాడీ పరిక్షా శిబిరం స్థానిక లయన్స్‌క్లబ్ మల్టీహాలులో ఆదివారం నిర్వహించారు. విజయవాడకు చెందిన కేరళ ఆయుర్వేద పంచకర్మ క్లినిక్ వైద్యుడు గ్రంధి సత్యప్రకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరంలో 75 మందిని పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు కంకట మోహనరావు ప్రారంభించారు. క్యాంపు చైర్మన్ భగవాన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టీ జగన్ మోహన్‌రెడ్డి, సీనియర్ సభ్యుడు జే రంగారెడ్డి, సీతారెడ్డి, నందమూరి వెంకట్రావు, క్లబ్ కార్యదర్శి అరుణకుమారి, కోశాధికారి జాన్‌టైటాస్, జె రాజేంద్రప్రసాద్, కిరణ్ వీర్ల పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల డైరీ ఆవిష్కరణ

మైలవరం: స్థానిక కార్యాలయంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రచురించిన డైరీని తహసీల్దార్ ముత్యాల శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా తహసీల్దార్ శ్రీనివాస్ ఏఈఆర్‌ఓ అవార్డు అందుకున్న సందర్భంగా డీలర్లు శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ మాధవి, రేషన్ డీలర్లు అసోసియేషన్ అధ్యక్షుడు కూతాడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు తొమ్మండ్రు సత్యనారాయణ, కమిటీ సభ్యులు గువ్వల కృష్ణారెడ్డి, జాజుల నాగరాజు, పాకలపాటి సత్యవర్ధనరావు, కొసనం రంగారావు, కోశాధికారి నాగూర్ భాషా, వెల్వడం శారద, మైలవరం మండల డీలర్లు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ముత్యాల ప్రసాద్

ఉరుసు మహోత్సవాలకు దర్గా ముస్తాబు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ప్రసిద్ధిగాంచిన షాబూఖారీ బాబా దర్గా 426వ ఉరుసు మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు దర్గా సూఫీ మత గురువు మహ్మద్ ఆల్తాఫ్ రజా ఆదివారం తెలిపారు. బుఖారా ఇస్లాం దేశం నుంచి మహ్మద్ ప్రవక్త వంశీయులు మత ప్రచారం చేసుకుంటూ ఇక్కడకు వచ్చి స్థిరపడి 426 ఏళ్ల క్రితం జీవసమాధి అయినట్లు చరిత్ర చెబుతుందని అన్నారు. మంగళవారం గుసుల్‌తో ప్రారంభమైన ఉత్సవాలు గురువారం చిరాగాతో ముగుస్తాయి. బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగే గంథం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సందర్భంగా దర్గా, దర్గా ప్రాంగణాల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు. కులమతాలకు అతీతంగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆల్తాఫ్ రజా తెలిపారు.

5న ఆలయ పునఃప్రతిష్ఠ



తిరువూరు: తిరువూరులో శ్రీకోదండరామస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమం ఫిబ్రవరి 5న జరుగుతుందని ఆలయ పునర్నిర్మాణ కమిటీ తెలిపింది. 150 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయం జీర్ణావస్థకు చేరడంతో దాతల సహకారంతో పునర్నిర్మాణం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సోమవరపు సత్యనారాయణ రావు, కొల్లిపర సుబ్బారావులు తెలిపారు. వచ్చేనెల 1 నుంచి పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 5వ తేదీ ఉదయం 9.15 గంటలకు శ్రీహనుమత్, లక్ష్మణ సీతా సమేత కోదండ రామస్వామి, గోదాదేవి, శ్రీరామానుజుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం సర్వోదయ స్కూలు ఆవరణలో జరుగుతుందని పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు



ఇబ్రహీంపట్నం: విద్యావనరుల కేంద్రం ఆవరణలో యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశం ఆదివారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానంతో పదవీవిరమణ తర్వాత ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడతారన్నారు. గతంలో మాదిరిగా పాతపెన్షన్ విధానం అమలు చేసి ఉద్యోగుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, పెనుగంచిప్రోలు తదితర మండలాల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కార్యదర్శులు పులి శ్రీనివాసరావు, రెడ్‌స్టార్, జిల్లా కౌన్సిలర్ బాణావత్ అమర్‌నాయక్, మండల అధ్యక్షుడు కృష్ణారావు, ఆర్మ్‌స్ట్రాంగ్, ప్రాంతీయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

నూజివీడు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తోన్న వ్యాన్‌ను పోలీసులు సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ ఆదివారం వేకువ జామున 5.30 గంటల సమయంలో మండలంలోని తుక్కులూరు వై జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి పెదపాడు మండలం ముప్పర్రుకు కోళ్ల వ్యర్థాలను తీసుకెళ్తున్న వ్యాన్‌ను గమనించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అక్కపాలెంలో గడప గడపకు..

తిరువూరు: మండలంలోని అక్కపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఎమ్మెల్యే రక్షణనిధి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణ పరిధిలోని అన్నవరం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ డీ కృష్ణనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ, అన్నవరం, వెంకటాయపాలెం, హనుమంతుల గూడెం, వెంకటాద్రిపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.